క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోదా కల్యాణం



సామర్లకోటలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, గ్రామస్తులు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువ సమీపంలో ఉన్న అతిపూరాతన విష్ణు ఆలయంలో సోమవారం గోదా కల్యాణం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ మేరకు ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా గత నెల 16 నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకొని బోగి రోజున ప్రతి ఏడాది గోదా కల్యాణం నిర్వహిస్తారు. బిక్కిన వెంట్రాయుడు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దీంతో నెల రోజుల పాటు ఆలయంలో నిర్వహించిన ధనుర్మాస పూజలు ముగిశాయి.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



సామర్లకోట పంచారామ క్షేత్రం వద్ద ఆర్వో ప్లాంటు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన దివిస్ లాబోరెటరీ వారు ఏర్పాటు చేసిన సుమారు రూ.18 లక్షల విలువ కలిగిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ భళ్ల నీలకంఠం, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే బాబు, దివిస్ ప్రతినిధులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ఆలయ పండితు లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించిన ఎస్సై గరగారావు

సామర్లకోట: విశాఖపట్నం నుంచి గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చిన బాలుడు సోమవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయి స్థానిక గాంధీ చౌక్‌లో ఒంటరిగా తిరుగుతున్నాడు. బాలుడిని గమనించిన స్థానికులు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావుకు సమాచారం ఇచ్చారు. గరగారావు బాలుడిను స్టేషన్ సెంటర్‌లోని అవుట్ పోస్టు పోలీసు వద్దకు తీసుకువెళ్లి అతని నుంచి సమాచారం సేకరించారు. బాలుడు పేరు విలోకు చౌదరి అని, తన తండ్రి పేరు అశోక్ అని, తల్లి పేరు శృతి అని విశాఖపట్నం నుంచి వచ్చిన్నట్టు చెప్పాడు. దీంతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో సోమవారం రాత్రి తల్లిదండ్రులు రావడంతో ఎస్సై బాలుడిను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

ఘనంగా భీమేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర, పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారు జామున 4 గంటలకు స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలోని ఉన్న ఉప ఆలయాలలోను పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, భాస్కర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

షరా మామూలే..

- ఖాకీలు, రెవెన్యూ అధికారుల ఆదేశాలు తూచ్
- కోడిని గెలిపించిన పోలీస్ బాస్‌లు
- మామూళ్ల మత్తులో అధికారులు, కూటమి నేతలు



పెద్దాపురం రూరల్ పరిధిలో ఓ ప్రాంతంలో జరిగిన కోడి పందేలు

పెద్దాపురం: సంక్రాంతి పండగ అంటేనే కోడి పందాలన్నట్టు.. ఏళ్ల తరబడి ఆచారమంటూ పందెంరాయుళ్లు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. అటు కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇటు ప్రభుత్వ అధికారుల మాటలను పక్కన పెట్టి మరీ కోడి పందేలను నిర్వహిస్తున్నారు. అధికారులకు ఎర చూపించి, వారి ఆదేశాలను తుంగలో తొక్కి కోడిని గెలిపించారు. కోడి పందేలు సోమవారం నుంచే ముమ్మరం చేశారు. పెద్దాపురం సెగ్మెంట్‌లో తొలిరోజు బోగి పండగను పురష్కరించుకుని కోడి పందేలు దర్జాగా నిర్వహించారు. సంక్రాంతి మూడు రోజులు ఏటా కోడి పందేలు నిర్వహిస్తే ఈ ఏడాది మనం పందేలు నిర్వహించకపోతే మన పరువు పోతుందని ప్రజాప్రతినిధులు కొందరూ అటు కోర్టు ఆదేశాలను అలుసుగా తీసుకుని పందేలు వద్దు సంప్రదాయమే ముద్దు ప్రభుత్వ సూచనను కూడా పక్కన పెట్టేసి అధికారులు, కూటమి నేతలు మామూళ్ల మత్తులు మునిగి తేలుతున్నారు. కోట్ల రూపాయలు చేతులు మారాయి.

ఏటిపట్టు గ్రామాల్లో నాలుగైదు చోట్ల, మెట్ట ప్రాంతంలోని మరో రెండు చోట్ల కూటమి నాయకులు కొందరు మధ్యవర్తిత్వం వహించి పందేలకు సిద్ధమై, కోడి పందేల శిబిరాల్లోనే గుండాట, మద్యం విక్రయాలు జూదాలకు నిర్వహిస్తూ విచ్చలవిడి వ్యాపారాన్ని సాగించారు. అమ్మవారి జాతర పేరుతో రాత్రి వరకు కొన్ని చోట్ల బహిరంగంగానే డ్యాన్స్ ప్రోగ్రాంలు, గుండాట, అశ్లీల నృత్యాలతో పండగ వేడకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం



గుండాట నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో బహిరంగంగా కోడి పందేలు

కొత్తపల్లి: మండలంలో కోడి పందేలు బహిరంగంగానే నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. ఈ పందేలను నాయకుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. మండలంలో మూలపేట, రమణక్కపేట, వాకతిప్ప, కొత్తపల్లి, నాగులాపల్లి, ఇసుకపల్లి, కొమరగిరి, కొండెవరం, గోర్స, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తున్నారు. రాత్రులు సైతం నిర్వహించేందుకు లైట్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం కోడి పందాలను గుండాటను నిర్వహించరాదని హైకోర్టు సైతం చెప్పింది. పండగల్లో ఇటువంటి ఆటలు నిర్వహించరాదని నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ పోలీసులు సైతం హెచ్చరిస్తున్నారు. హెచ్చరికలు ఏమీ తమకు పట్టవంటూ నిర్వాహకులు బహిరంగంగానే కోడి పందేలను నిర్వహిస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు. చూసిచూడనట్లుగానే వ్యవహరిస్తున్నారు. సోమవారం ఒక్క రోజూ రూ.లక్షల్లో చేతులుమారాయి.

కోస మాంసానికి డిమాండ్

మూడు కిలోలు సుమారు రూ.4500



కోస (పందేంలో ఓడిన పుంజు)

కొత్తపల్లి: కోస మాంసానికి డిమాండ్ పెరిగింది. మండలంలో కోస మాంసం రుచి చూసిన వారు వాటి కోసం ఎగబడుతున్నారు. మూడు కిలోల కోస మాసం రూ.4500 నుంచి రూ.6000 వరకు పలికింది. ఇదే సమయంలో పందెంరాయుళ్లు అధికారులుకు, అనాధికారులకు, అభిమనులకు, బంధువులకు కోస మసాన్ని ఇవ్వడంతో మరింత డిమాండ్ పెరిగిందని కోస మాసం ప్రియులు పేర్కొన్నారు. సంక్రాంతి మంగళవారం రావడంతో ధర మరింత పెంచినట్టు మాసం ప్రియులు చెబుతున్నారు.

జోరుగా గ్రామాల్లో కోడి పందేలు



సామర్లకోట మండలంలో కోడి పందేలు

సామర్లకోట: గ్రామాలల్లో కోడి పందాలు స్వేచ్ఛగా జరిగాయి. కోడి పందాలు నిర్వహించడానికి వీలు లేదని రెవెన్యూ, పోలీసు అధికారులు ఆయా కోడి పందేలకు ఏర్పాటు చేసుకున్న టెంట్లను తొలగించారు. ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే మండల పరిధిలో జి. దపాడు, ఉండూరు, అచ్చంపేట, పనసపాడు, చంద్రం పాలెం, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాలల్లో జోరుగా కోడి పందాలు జరిగాయి. జి.మేడపాడు గ్రామంలో అయితే ప్రత్యేకగా స్కీన్ ఏర్పాటు చేసి మరీ కోడి పందేలు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. కోడి పందేల శిబిరాల వద్ద మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. మండల పరిధిలో మొదటిరోజు రూ.కోటి వరకు పందేలు జరిగిన్నట్టు అంచనా వేశారు.

వేట్లపాలెంలో పందేలకు చెక్

కోడి పందాలు అనగానే ప్రతి ఒక్కరికి వేట్లపాలెం గుర్తుకు వస్తుంది. అయితే గత నెలలో మూడు హత్యలు జరగడంతో ఆ గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. దీంతో కోడి పందేలు నిర్వహిస్తే ఘర్షణలు జరిగే అవకాశం ఉందని పోలీసులు కోడి పందేలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఉంచారు. దీంతో వేట్లపాలెంలో కోడి పందేల నిర్వాహకులు జి.మేడపాడు చేరుకొన్నారు.

ఘనంగా భోగి పండగ



కొత్తపల్లిలో భోగి మంట వేసిన దృశ్యం

పెద్దాపురం: భోగి పండగను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ వేకువ జామున లేచి అభ్యంగన స్నానమాచరించి కొత్త బట్టలు ధరించి పిల్లలు పిడకల దండను భోగి మంటల వేసి సందడి చేశారు. ఆయా ప్రధాన కూడలి వద్ద భారీ దుంగలతో యువకులు భోగి మంటలు వేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: వాడవాడలా భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగభాగ్యాలను కలిగించే భోగి పండగను సంప్రదాయ రీతిలో ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. వాడవాడలా తెల్లవారుజామున నుంచి దుంగలతో భోగి మంటలను ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి వీధిలోనూ భోగి మంటను వేశారు. ప్రజలు ఒకరినొకరు సంక్రాంతి శుభాకాంక్షలు చేప్పుకున్నారు. సంక్రాంతి సెలవులకు దూరప్రాంతాల్లో ఉన్న బంధువులు అల్లుళ్లు అందరూ ఒక దగ్గరకు చేరడంతో ఇళ్లన్నీ సందడిగా ఉన్నాయి. ఇళ్లల్లో పిండి వంటలు చేస్తూ అందరూ సంతోషంగా గడుపుతున్నారు. గంగిరెద్దులు వారు ఇంటింటికి తిరుగుతూ సన్నాయి. సంక్రాంతి పండగ రాకతో మండలంలోని ఇళ్లన్నీ సందడి వాతావరణంలో ఉన్నాయి.

సామర్లకోటలో..

సామర్లకోట: భోగి పండగ వేడుకలను సోమవారం పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండగకు స్వాగతం పలుకుతూ భోగి పండగను నిర్వహిస్తారు. తెల్లవారు జామునే భోగి మంటలను ఏర్పాటు చేశారు. మండలంలో ప్రతి గ్రామంలోనూ భోగి మంటలు వేశారు. పిల్లలను తల స్నానం చేసి కొత్త బట్టలు ధరించి ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలతో భోగి మంటల వద్దకు వెళ్లి భోగి దండలను మంటలలో వేశారు. భోగి మంటల నుంచి వచ్చే పొగను పీల్చడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందనే వాదనలు ఉన్నాయి. అదే విధంగా భోగి రోజున చిన్నారులపై రేగుపండ్లు, పూలు వేశారు.



చదలాడలో భోగి మంట వద్దకు చిన్నారులను తీసుకువెళుతున్న కుటుంబ సభ్యులు



గ్రామాల్లో హరిదాసు సంకీర్తనలు



సామర్లకోటలో భోగి మంటల వద్ద పిల్లలు పెద్దలు

విద్యుత్ బిల్లులు దహనం



భోగి మంటలో విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: మాయమాటలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వచ్చాక పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సోమవారం పెద్దాపురం పట్టణ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలియజేశారు. స్థానిక వరహాలయ్యపేటలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను తగులపెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం మోపిందన్నారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో గతంలో వాడిన కరెంట్ బిల్లులు చెల్లించాలంటూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తుందన్నారు. దాదాపు 15,400 కోట్లు పైబడి చార్జీల భారాన్ని పేదలపై వేయడం సరి కాదన్నారు. పెరిగిన చార్జీలపై ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, సిరిపురపు మరిడయ్య, డి.కృష్ణ, నరసింహమూర్తి, సుబ్బలక్ష్మి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

పిఠాపురం: ఈనెల 10వ తేదీన పిఠాపురంలో నిర్వహించిన సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దళిత వాడలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఏవైఎం అసోసియేషన్ సభ్యులు సోమవారం పిఠాపురంలో ఆందోళన నిర్వహించారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన వారు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించి మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవైఎం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భోగి గణపతి ధాన్యాభిషేకం

బోట్‌క్లబ్: స్వయంభూ కాకినాడ భోగి గణపతి పీఠం 18వ వార్షిక బ్రహ్మోత్సవ ఆరాధన సోమవారం వైభవంగా నిర్వహించారు. తొలుత గోగు పిడకలు పేర్చి ఆవు నెయ్యితో భోగి మంట వెలిగించి గోక్షీరాన్ని పొంగించారు. బాలలకు భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. అనంతరం స్వామి వారికి ధ్యానపురాశితో మహాధాన్యాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఆరాధకుల సందర్శనం కోసం వినాయక చవితి నుంచి 24 గంటల పీఠం గర్భాలయ ద్వారాలు తెరిచి ఉంచుతామన్నారు. పీఠం ఆధ్వర్యంలో మాఘమాసం నుంచి ఆరాధకుల ఇంటిలో ప్రతి నెల రెండో ఆదివారం త్రినాథ వ్రత పూజ నిర్వహించనున్నట్టు చెప్పారు.

చంద్రశేఖరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సామర్లకోటలోని చంద్రశేఖరస్వామి

సామర్లకోట: స్థానిక పాత సామర్లకోటలో వేంచేసి యున్న చంద్రశేఖరస్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు పౌర్ణమిని పురస్కరించుకొని పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మాజీ అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్యాల సంక్రాంతి



పిఠాపురంలో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



పండగ కళ, (కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న పిఠాపురం బజారు వద్ద మెయిన్ రోడ్డు)

- నేడు మకర సంక్రాంతి
- పెద్ద పండగకు ఘనంగా ఏర్పాట్లు
- కళకళలాడుతున్న గ్రామాలు
- అయ్యప్ప ఆలయాలలో జ్యోతి దర్శనాలకు ఏర్పాట్లు
- వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: భోగభాగ్యాల భోగి పండగతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని వీధుల్లోను భోగిమంటలు భగభగమండుతుంటే సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలో ప్రవేసించే సమయమే మకర సంక్రాంతి. మూడు రోజులు పండుగైన మకర సంక్రాంతి కన్నులు పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తవడంతో పల్లెలన్నీ కళకళాడుతున్నాయి. ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభం కావడంతో దేవాలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. మరోపక్క ఆదివారం భోగి పండగ నాడు పిఠాపురంలో వీధులన్ని జనంతో కిటకిటలాడాయి. ప్రముఖ వైష్ణవాలయం అయిన కుంతీ మాధవస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో అయ్యప్ప ఆలయాల్లో మకరజ్యోతి దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సంపదను ప్రసాదించే కనుమ

సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండుగకు విశిష్ట స్థానం ఉంది. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజించే పండుగే కనుమ. కనుమ రోజున కళకళలాడుతున్న ధాన్యపు రాసులకు రైతులు పూజలు నిర్వహిస్తుంటారు. పశువులను శుభ్రంగా కడిగి పూల దండలతో అలంకరిస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు మినుములతో చేసిన వంటకాలకు ప్రాధాన్యమిస్తారు. అందుకే కనుమ పండు నాడు భోజనాల్లో గారెలు, సున్నుండలు తప్పని సరిగా వడ్డిస్తారు. వివిధ రకాల కూరగాయలతో తయారు చేసే కలగలుపు కూరలను తింటుంటారు. కనుమ నాడు కాకై నా కదలదన్నానుడి ఉండడంతో ఆ రోజున ఎవ్వరూ ప్రయాణాలు చేయరు. ఇంటి వద్దే ఉండి పిల్లలు, బంధువులతో సరదాగా కాలం గడుపుంటారు.

కోడి పందేల జోరు

ఒక పక్క జూదాలు ఆడితే తాట తీస్తామంటు హెచ్చరికలు చేసిన ఖాకీలు దాడులు చేసి గుండాటలను నిలువరించగా కోడి పందేలు మాత్రం సాంప్రదాయబద్ధంగా అంటూ జూదంగా నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో జూదాలు జోరుగా సాగాయి. ఎక్కడ చూసినా గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారు.

కరపలో క్రికెట్ టోర్నీ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ కరప(సీఏకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్-2025 పోటీలు ఉల్లాసంగా, జోరుగా సాగుతున్నాయి. క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూడోరోజు సోమవారం రెండు నాకౌట్, ఒక ఎలిమినేటర్, రెండు సెమీఫైనల్ పోటీలు జరిగాయి. నాకౌట్ పోటీలలో మొదటిమ్యాచ్‌లో కేఆర్పీ-11 జట్టుపై కొత్తపేట కరప జట్టు 9 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో వాకాడ జట్టుపై జెడ్.భావారం జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కొత్తపేట కరప జట్టుపై పల్లపువీధి జట్టు 3 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. నాకౌట్ మొదటి సెమీ ఫైనల్‌లో హోరాహోరీగా జరిగిన పోటీలో పల్లపువీధిజట్టుపై జెడ్.భావారం జట్టు 47 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్‌లో ఫ్రెండ్స్-11 కరప జట్టు చేతిలో మారీబాయ్స్ వేళంగి జట్టు ఓటమిపాలైందని నిర్వాహకులు మేడిశెట్టి దుర్గాకిరణ్, నక్కా భీమ్, పోలిశెట్టి సునీల్ తెలిపారు. మంగళవారం నాకౌట్ ఫైనల్ పోటీ, సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ మెయిన్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా లయన్స్ వ్యవస్థాపక దినోత్సవం



బాదం బాలకృష్ణను సత్కరించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో క్లబ్ అధ్యక్షుడు ఎంపీఆర్ మోహన్‌కుమార్ అధ్యక్షతన లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులైన లయన్ మెల్విన్ జోన్స్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ ఫౌండేషన్ ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి ఇళ్లు కట్టించడం, కంటి ఆస్పత్రి నిర్మాణం, మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం లయన్స్ ఫౌండేషన్‌కు తమ కుటుంబం నుంచి రూ.13 లక్షల విరాళంగా ఇచ్చిన బాదం బాలకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా రూ.1.70 లక్షల ఇచ్చిన పూర్వపు గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు, జి.ఎల్.జగన్నాథరావు, రూ.85వేలు ఇచ్చిన రీజియన్ చైర్‌పర్సన్ పద్మతులసి, మేడిశెట్టి వెంకటరమణ, పద్మాక్షి, కె.భామిరెడ్డి, కరుటూరి శ్రీనివాస్, రమాసుందరి, మట్టపల్లి సురేష్‌కుమార్, ఏఏఆర్ మోహన్‌రావు, చక్కా శ్రీనివాస్, పీవీ సుబ్బారావులను సత్కరించారు.